సాక్షి
పెద్దపల్లి
శనివారం । 14 । డిసెంబర్ । 2024



మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ పర్యటన

గోదావరిఖని: ఆర్జీ–1 పరిధిలోని జీడీకే–1,3 గనిపై మల్టీడిపార్ట్‌మెంట్ కమిటీ శుక్రవారం పర్యటించింది. జీఎం లలిత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పలు అంశాలు వివరించారు.



'కస్తూరిబా' తనిఖీ

రామగిరి(మంథని): పన్నూర్ కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను అదనపు కలెక్టర్ వేణు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/15.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. ఉదయం, రాత్రి వేళలో చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డిపెండెంట్‌కు ఉద్యోగం



నియామకపత్రం అందిస్తున్న జీఎం

గోదావరిఖని: గనిప్రమాదంలో మృతి చెందిన కార్మికుడి కుమారునికి సూటబుల్ జాబ్ ఆర్డర్ కాపీని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అందజేశారు. శుక్రవారం తన కార్యాలయం జరిగిన కార్యక్రమంలో ఇజ్జగిరి రమేశ్‌కు ఫోర్‌మెన్ మెకానికల్ ట్రెయినీగా సూటబుల్ జాబ్ నియామకపత్రాన్ని అందించామన్నారు. జీడీకే–11గనిలో ఎస్‌డీఎల్ యంత్రంపై పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన ప్రతాప్ కుమారుడు రమేశ్ అని జీఎం వివరించారు. బీటెక్ మెకానికల్ పూర్తిచేసిన ఆయనకు ఫోర్‌మెన్ మెకానికల్ ట్రైనీగా ఉద్యోగం కల్పించామని జీఎం తెలిపారు. ప్రతినిధులు అరెల్లి పోశం, కిరణ్‌బాబు, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

'కేసు నమోదు చేయాలి'



ఫిర్యాదు ప్రతులను చూపిస్తున్న పుట్ట మధు

మంథని: అసెంబ్లీ ఎన్నికల సమయంలో మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన మంథని ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబుపై చీటింగ్ కేసు నమోదు చేయాలని స్థానిక ఎస్‌ఐతోపాటు డీజీపీ వరకు పోలీసులకు రిజిష్టర్డ్ పోస్టు ద్వారా ఫిర్యాదు పంపినట్లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పి ఏడాదైనా అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, శంకర్‌లాల్, అరెపల్లి కుమార్, రాజుగౌడ్, ప్రకాశ్‌రెడ్డి, కనవేన శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

హిందీ నేర్చుకోవాలి



ప్రశంసాపత్రాలతో అధికారులు, ఉద్యోగులు

జ్యోతినగర్(రామగుండం): హిందీ రాజ్యభాష అని, ప్రతీఒక్కరు హిందీ నేర్చుకుని మాట్లాడాలని ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు కోరారు. ఎన్టీపీసీ ఉద్యోగ వికాస కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన హిందీ అనువాద శిక్షణలో ఆయన మాట్లాడారు. అంతరాలను తగ్గించి కమ్యూనికేషన్స్‌ను ప్రోత్సహించే ఏకీకృతంగా హిందీ నిలిచిందన్నారు. ప్రాజెక్టులోని పనిప్రదేశాల్లో హిందీ పాత్రను బలోపేతం చేయాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్స్ లేఖాసరీన్, జన్వారియూస్‌లు శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రశంసాపత్రాలను అందించారు. జనరల్ మేనేజర్ త్రిపాఠి, ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, ప్రవీణ్ కే చౌదరి, ఆదేశ్ కుమార్ పాండే, రూపాలి రంజన్ పాల్గొన్నారు.

గ్రూప్–2కు పటిష్ట బందోబస్తు

గోదావరిఖని: జిల్లాలో ఏర్పాటు చేసిన గ్రూప్–2 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈనెల 15, 16వ తేదీల్లో చేపట్టే పరీక్షలకు కమిషనరేట్ పరిధిలో 66 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 23,969మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈనెల 15 ఉదయం 6గంటల నుంచి ఈనెల 16 సాయంత్రం 6 వరకు పోలీసు ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రాలకు 300 మీటర్ల దూరం వరకు గుంపులుగా తిరగరాదని, సభలు, సమావేశాలు, ర్యాలీలు, మైకులు, డీజేలతో ఊరేగింపులు, ధర్నాలు, ప్రచారాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేసేలా ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

చట్టాన్ని గౌరవిస్తేనే ఫ్రెండ్లీ పోలీసింగ్

పాలకుర్తి(రామగుండం): చట్టాన్ని గౌరవిస్తేనే ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉంటుందని, దానిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. జిల్లాలోని పలువురు రౌడీషీటర్లతో బంధంపల్లి స్వరూప గార్డెన్‌లో 'ఫర్ బెటర్ లైఫ్' నినాదంతో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ, తొందరపాటుతో చేసిన నేరాలతో ఏ తప్పూ చేయని కుటుంబసభ్యులు ఇబ్బందులు పడతారన్నారు. రౌడీషీటర్లు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో తమ పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీలు గజ్జి కృష్ణ, రమేశ్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



పోలీస్ పాఠం

పాలకుర్తి(రామగుండం): శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా లాఠీ పట్టుకుని అసాంఘిక శక్తుల ఆటకట్టించే రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్.. చాక్‌పీస్ పట్టుకుని విద్యార్థులకు పాఠాలు బోధించారు. రాఘవాపూర్ శివారు ఇటుక బట్టీల్లో శుక్రవారం బట్టీకార్మికుల పిల్లలకు చదువు చెప్పే లక్ష్యంతో పోలీసు శాఖ తరఫున వర్క్‌సైట్ స్కూల్‌ను సీపీ ప్రారంభించారు. తొలుత చాక్‌పీస్ పట్టుకుని 'జెడ్ ఫర్ జీబ్రా' అంటూ ఇంగ్లిష్ అక్షరాలను బ్లాక్‌బోర్డుపై రాసి చిన్నారులతో చదివించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీలు ఉన్నారు.



అభివృద్ధి పథం

సుల్తానాబాద్(పెద్దపల్లి): రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో 52 మంది లబ్ధిదారులకు శుక్రవారం ఆయన కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసి మాట్లాడారు. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగిస్తున్నామని అన్నారు. పెద్దపల్లికి ఆర్టీసీ బస్సు డిపో మంజూరు కావడంతో మారుమూల గ్రామాలకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వివరించారు. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, అధికారులు, నాయకులు ఉన్నారు.



నిరసన గళం

గోదావరిఖని: జోన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను బదిలీ చేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం నిరసన తెలిపారు. చిన్న తప్పిదాలను కారణంగా చూపి కార్మికులను బదిలీ చేయాలనే ఆలోచన సరికాదన్నారు. ఈమేరకు ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. జీఎం లలిత్‌కుమార్ వారితో చర్చలు జరిపి బదిలీలను నిలివేయడానికి అంగీకరించారు. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. నాయకులు రియాజ్‌అహ్మద్, తుమ్మల రాజారెడ్డి, ఎ.వెంకన్న, ఇ.నరేశ్, అశోక్, వేణు ఉన్నారు.

రాజన్న బంగారం!

- స్వామివారి వద్ద క్వింటాల్ బంగారం.. ఐదు టన్నుల వెండి
- వేములవాడ రాజన్నకు పెరుగుతున్న కానుకలు
- భక్తుల నుంచి ప్రత్యక్ష, హుండీల ద్వారా రాక
- బంగారం, వెండి ఆభరణాల రాకతో సర్వత్రా ఆసక్తి
- నేతలు, వీఐపీలు, సెలబ్రిటీల రాకతో రద్దీ
- వచ్చే జనవరి నుంచి వరుస ఉత్సవాలు, వేధిస్తున్న సిబ్బంది కొరత


సాక్షి ప్రతినిధి, కరీంనగర్:


ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలకు ఇలవేల్పు.. దక్షిణకాశీగా పిలుచుకునే వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తుల రద్దీ పెరుగుతోంది. క్రమంగా కానుకలు కూడా పెరుగుతున్నాయి. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన వేములవాడ రాజన్నకు బంగారం, వెండి ముడుపులు గతం కన్నా మెరుగవుతున్నాయి. ఒకప్పుడు రాజకీయ నాయకులు పదవులు పోతాయన్న దుష్ప్రచారాన్ని నమ్మి ఆలయానికి వచ్చేందుకు పెద్దగా ఆసక్తి చూపేవారు కాదు. మాజీ సీఎం కేసీఆర్, ప్రధాని మోడీ, ప్రస్తుత సీఎం రేవంత్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్వామివారిని దర్శించుకుని రెండోసారి జయకేతనం ఎగరవేయడం కలిసి వచ్చింది. కొంతకాలంగా సెలబ్రిటీలు, సినీనటులు, మంత్రులు, ఎమ్మెల్యేలు మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా తరలివస్తున్నారు. రాజన్నకు కోడెలతోపాటు బంగారం, వెండి ఆభరణాలు సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. ప్రస్తుతం స్వామివారి వద్ద దాదాపు క్వింటాలు బంగారం, ఐదు టన్నుల వెండి ఉంది. క్రమంగా రవాణా సౌకర్యాల మెరుగు పడుతుండడంతో భక్తులతోపాటు పర్యాటకులు తరలివస్తున్నారు. కొత్తపల్లి– మనోహరాబాద్ రైలుమార్గం పూర్తయితే మూడేళ్లలో రాజన్నకు భక్తుల రద్దీ రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

కొంతకాలంగా రాజన్న ఆలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఏఈవో రమేశ్ బాబును మాతృసంస్థకు డిప్యూటేషన్ మీద పంపారు. సూపరింటెండెంట్ రాజన్‌బాబును డిప్యూటేషన్ కింద యాదగిరి గుట్టకు వెళ్లారు. మరో సూపరింటెండెంట్ శ్రీలతను వేములవాడ నుంచి యాదగిరి గుట్టకు డిప్యూటేషన్ మీద పంపారు. అక్కడ పనిచేస్తున్న వేములవాడ ఉద్యోగి ప్రతాప నవీన్‌కు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పదోన్నతి కల్పించినా వేములవాడకు తిరిగి పంపించడం లేదు. సూపరింటెండెంట్‌గా పదోన్నతులు పొంది కొండగట్టులో పనిచేస్తున్న ఉపాధ్యాయుల చంద్రశేఖర్, ఎర్రం భూపతిరెడ్డిని వేములవాడకు పంపించాల్సి ఉన్నా జాప్యం చేస్తున్నారు. ఒక డీఈవో, ఏఈవో, మరో నలుగురు సూపరింటెండెంట్లు వేములవాడకు రాకపోవడం వల్ల పని ఒత్తిడి అంతా మిగిలిన వారిమీద పడి పరిపాలన ఒత్తిడి పెరిగి భక్తులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని ఆలయ సిబ్బంది, భక్తులు భావిస్తున్నారు. జనవరి నుంచి జాతరలు, కల్యాణాలు జరగనున్న నేపథ్యంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. అయినా దేవాదాయశాఖ నిర్లక్ష్యం వహించడంతో ఉద్యోగుల కొరత అలాగే వేధిస్తోంది. వెంటనే ఆయా ఉద్యోగుల భర్తీ చేపట్టాలని సిబ్బంది, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.







(నోట్:30-04-2024 నుంచి ఇప్పటి వరకు 100 కిలోల బంగారం, 5,000 కిలోల వెండి వచ్చినట్లు సమాచారం.)



పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

జ్యోతినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టుల ప్రదర్శనలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. సైన్స్ ఫెయిర్‌లో ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న సమయంలో నాణ్యమైన ఆహారం అందించాలని, ఇందులో ఎటువంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని సూచించారు. పాఠశాలల్లో విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన వినోదం ఉండాలని కలెక్టర్ అన్నారు. అందుకోసమే సైన్స్ ఫెయిర్ నిర్వహణ, పర్యాటక ప్రాంతాల సందర్శన వంటి కార్యక్రమాలకు రూపకల్పన చేయడం చాలా మంచి పరిణామమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, సైన్స్ అధికారి రఘునందన్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మధ్యాహ్న భోజనం పరిశీలన

రామగుండం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ కోయ శ్రీహర్ష సందర్శించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, తయారీ ప్రాంగణాన్ని పరిశీలించారు. పరిసరాలు, వంటపాత్రలు శుభ్రంగా ఉండాలని ఆదేశించారు. స్వచ్ఛమైన నీటిని వంటకు వినియోగించాలని, కాలం చెల్లిన ఆహార పదార్థాలను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తూకంలో మోసం.. రైతుల ఆందోళన

రామగిరి(మంథని): నాగెపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో కొందరు తూకంలో మోసం చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. ధాన్యం తూకం వేస్తుండగా కొందరు రైతులకు అనుమానం వచ్చి.. బయట వేరొక కాంటాపై తూకం వేశారు. మళ్లీ కొనుగోలు కేంద్రంలోకి వచ్చి తూకం వేయగా చాలా వ్యత్యాసం రావడంతో ఆందోళనకు దిగారు. అధికారుల ముందే తూకం వేయగా కొనుగోలు కేంద్రంలోని కాంటా 41 కిలోల బరువు చూపగా, మరో యంత్రంపై 42.500 కిలోలు చూపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతకాలంగా ఇలా అధికంగా తూకం వేయడంతో తాము నష్టపోయామని మండిపడ్డారు. ఇప్పటివరకు కొనుగోలు కేంద్రం నుంచి 36 లారీల లోడ్ ధాన్యం రైస్‌మిల్లులకు తరలివెళ్లిందని, దాదాపు 7,800 క్వింటాళ్ల ధాన్యం క్రయవిక్రయాలు సాగాయని తెలిపారు. సుమారు 4 గంటల పాటు అధికారులు, రైతుల మధ్య ఈవిషయంపై వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే, ధర్మకాంటా వద్ద రశీదులు తీసుకొచ్చి, ఘటనపై విచారణ చేపడతామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీపీఎం తిరుపతి హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.



ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

రైతులకు 91శాతం చెల్లింపులు

కమాన్‌పూర్(మంథని): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 91శాతం డబ్బులు చెల్లించామని, దీంతో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని అదనపు కలెక్టర్ వేణు తెలిపారు. స్థానిక ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. జిల్లాలో 2,40,451 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా రూ.508.91కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని అదనపు కలెక్టర్ అన్నారు. రూ.63, 52,94,000 బోనస్ చెల్లించామని ఆయన వివరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్ ఉన్నారు. అంతకుముందు అదనపు కలెక్టర్ వేణు స్థానిక శ్రీఆదివరహాస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో కాంతరెడ్డి ఆయనను శాలువాతో సత్కరించారు.



ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణు

గంటకు 15 టన్నులు

- రూ.170 కోట్ల పెట్టుబడి.. 24 ఎకరాల విస్తీర్ణం
- పెద్దరాతుపల్లి గ్రామ శివారులో స్థాపన
- శరవేగంగా ఆయిల్‌పామ్ పరిశ్రమ నిర్మాణం పనులు
- సుమారు 200 మంది కార్మికులకు ఉపాధి కల్పన
- ఏడాదిలోగా అందుబాటులోకి
- ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం





పెద్దరాతుపల్లి గ్రామ శివారులో శరవేగంగా కొనసాగుతున్న ఆయిల్‌పామ్ పరిశ్రమ పనులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పెద్దరాతుపల్లి గ్రామ శివారులో గంటకు 15 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో చేపట్టిన ఆయిల్‌పామ్ నూనె తయారీ పరిశ్రమ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు హైదరాబాద్‌కు చెందిన తిరుమల ఆయిల్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సుమారు రూ.170 కోట్లు వెచ్చించి దాదాపు 24 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టింది. దాదాపు 200 మంది కార్మికులకు పరిశ్రమలో ఉపాధి లభిస్తుందని జిల్లా ఉద్యాన వన శాఖ అధికారులు చెబుతున్నారు. ఉద్యాన వన శాఖ అధికారుల సలహాలు, సూచనలు, ప్రోత్సాహంతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్న రైతులకు ఈ పరిశ్రమ చేరువలో ఉండడం, నేరుగా ఉత్పత్తులు కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందని అంచనా.

త్రిభుజాకారంలో..

నర్సరీ నుంచి తీసుకొచ్చిన రైతులు ఆయిల్‌పామ్ మొక్కలను త్రిభుజాకారంలో నాటారు. మూడేళ్ల తర్వాత పంట కాపు వస్తుంది. నెలకు రెండు గెలల చొప్పున 45 రోజులకోసారి కోతకు వస్తుంది. గెల కోసిన 48 గంటల్లోనే పరిశ్రమకు తరలించాల్సి ఉంటుంది. ఒకసారి మొక్కలు నాటితే దాదాపు 30 ఏళ్లకు వరకు దిగుబడి వస్తుంది. ఒక్కో గెల బరువు 10 కిలోల – 40 కిలోల వరకు ఉంటుందని, టన్ను ధర రూ.20,500 చెల్లిస్తారని అధికారులు వివరిస్తున్నారు. ఆయిల్‌పామ్ గెల కోసిన 48గంటల్లోగా పరిశ్రమకు తరలించాల్సి ఉంటుందని, జిల్లాలోనే ఆయిల్‌పామ్ తయారీ పరిశ్రమ ఉండడంతో రైతులు అక్కడకు తీసుకెళ్లడం ఎంతో సులభతరమవుతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.

ఉత్పత్తి, ప్యాకింగ్, మార్కెటింగ్..

పెద్దరాతుపల్లి గ్రామ శివారులో స్థాపిస్తున్న ఆయిల్‌పామ్ పరిశ్రమలో నూనె తయారు చేస్తారు. ఇక్కడే వివిధ పద్ధతుల్లో నూనెను ప్యాకెట్లలో ప్యాక్ చేస్తారు. ఆ తర్వాత అధికారుల సూచనలతో పరిశ్రమ యాజమాన్యమే మార్కెటింగ్ చేస్తుంది. వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచే సరఫరా చేస్తుంది. ఈ నూనెను కాస్మొటిక్స్, వాజిలిన్, ఆహారపదార్థాల తయారీలో వినియోగిస్తారు.

కలెక్టర్ భరోసా..

ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాదు.. గత జూలైలో పెద్దరాతుపల్లి గ్రామంలో అవగాహన సభ కూడా నిర్వ నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇవ్వడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పెరుగుతోంది.

అధికారుల ప్రోత్సాహం



ఉద్యాన అధికారుల ప్రోత్సాహంతో నాకున్న మూడేళ్ల కింద మూడెకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాం. డ్రిప్‌తో నీటి అవసరం తక్కువగా ఉంటుంది. అధికారుల సూచనతో పువ్వుదశలో ఒకసారి తెంపి చూశాం. ఎలాంటి ఇబ్బందులు లేవు. అంతర పంటగా పత్తి, కూరగాయలు పండిస్తున్నాం. మరోమూడెకరాల్లో వేయాలనుకుంటున్నాం. – పత్తి శ్రీనివాస్‌రెడ్డి – శ్రీలత, రైతు దంపతులు, పెగడపల్లి

వచ్చే ఏడాది అందుబాటులోకి



ఆయిల్‌పామ్ గెలలను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తాం. పరిశ్రమను 2025 వరకు అందుబాటులోకి తెస్తాం. ఆయిల్ తయారు చేసి మేమే మార్కెటింగ్ చేస్తాం. ఆసక్తిగల రైతులు కాల్వశ్రీరాంపూర్‌లోని ఫీల్డ్ ఆఫీసర్ అజయ్ యాదవ్‌ను 91546 80524, ఉద్యాన అధికారి మహేశ్‌ను 94912 70503 నంబర్లలో సంప్రదించవచ్చు. – కేశు కళ్యంకర్, సీఈవో, ఆయిల్‌పామ్ పరిశ్రమ

హామీలు నెరవేర్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: హామీలు నెరవేర్చడమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ ముందుకు వెళ్తోందని ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు ముందుకు సాగుతున్నారన్నారు. సింగరేణి కార్మికులకు 250 గజాల స్థలం, రూ.20లక్షలు వడ్డీలేని రుణం అందజేసేలా చూస్తున్నారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న టీబీజీకేఎస్ కార్మికులకు అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు. ఐఎన్‌టీయూసీ ఆరుగ్యారంటీలు ఇచ్చిందని, అందులో ప్రధానంగా కొత్త భూగర్భగనులు తేవాలని చెప్పామన్నారు. దీనిలో భాగంగా ఢిల్లీకి వెళ్లి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి కలిశారన్నారు. కొత్తగనులు వస్తే ఈప్రాంతంలో నిరుద్యోగం తీరుతుందన్నారు. ప్రైవేటీకరణ అడ్డుకుంటామని, తాడిచర్ల, కిష్టారం, కోయగూడెం ఓసీపీ, నైనీబ్లాక్ ప్రైవేట్ అప్పగించకుండా చూస్తామని అన్నారు. నాయకులు పోతరవేని సమ్మయ్య, కచ్చకాయల సదానందం, దాస్, టైసన్ శ్రీనివాస్, గడ్డం కృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీఎం కప్ పోటీలు

- ఈ నెల 21 వరకు క్రీడా సందడి
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పూర్తయిన ఏర్పాట్లు

సీఎం కప్ లోగో



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్–2024 కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లా స్థాయి పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 21 వరకు ఆయా జిల్లా కేంద్రాల్లో అట్టహాసంగా నిర్వహించేందుకు క్రీడాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాస్థాయి పోటీలకు సంబంధించిన షెడ్యూల్‌ను డీవైఎస్‌వోలు ఖరారు చేశారు. జిల్లా జట్లను ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ నెల 18 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు జరగనున్నాయి. 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు వివిధ క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

కరీంనగర్ జిల్లాస్థాయి పోటీలు..

- 15న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో బేస్‌బాల్ పోటీలు.
- 16న అథ్లెటిక్స్, జూడో (ప్రాంతీయ క్రీడా పాఠశాలలో), ఆర్చరీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ (అంబేడ్కర్ స్టేడియంలో).
- 17న రెజ్లింగ్(ప్రాంతీయ క్రీడా పాఠశాలలో), బ్యాడ్మింటన్ (అంబేడ్కర్ స్టేడియం ఇండోర్ హాల్‌లో), బాక్సింగ్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, యోగా(అంబేడ్కర్ స్టేడియంలో), వుషు (ఫండస్ పాఠశాలలో).
- 18న టేబుల్‌టెన్నిస్(జీఎస్ అకాడమీ), వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్ (ప్రాంతీయ క్రీడా పాఠశాలలో), హాకీ, నెట్‌బాల్, అత్యాపత్యా, పవర్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్(అంబేడ్కర్ స్టేడియంలో), చెస్ (జీనియస్ చెస్ అకాడమీ), సెపక్ తక్రా, కరాటే, కిక్ బాక్సింగ్ (అంబేడ్కర్ స్టేడియం ఇండోర్ హాల్‌లో), సైక్లింగ్ (శాతవాహన వర్సిటీ).
- 19న తైక్వాండో (అంబేడ్కర్ స్టేడియం ఇండోర్ హాల్‌లో).

జగిత్యాల జిల్లాలో..

- 16న జగిత్యాల స్వామి వివేకానంద మినీ స్టేడియంలో వాలీబాల్, చెస్, జూడో, బేస్‌బాల్ పోటీలు.
- 17న కబడ్డీ, బాక్సింగ్, బిలియర్డ్స్ స్నూకర్, బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ (జగిత్యాల క్లబ్).
- 18న ఖోఖో, ఫుట్‌బాల్ (స్వామి వివేకానంద మినీ స్టేడియం).
- 19న అథ్లెటిక్స్, యోగా, కిక్‌బాక్సింగ్ (స్వామి వివేకానంద మినీ స్టేడియం).
- 20న నెట్‌బాల్, సైక్లింగ్, బాస్కెట్‌బాల్ (స్వామి వివేకానంద మినీ స్టేడియం).
- 21న హ్యాండ్‌బాల్, వుషు, రెజ్లింగ్ (స్వామి వివేకానంద మినీ స్టేడియం).
- 16 నుంచి 21 వరకు క్రికెట్ (ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో, గీతా విద్యాలయంలో).

రాజన్న సిరిసిల్లలో..

- 18న సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు.
- 19న హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్ (రైసింగ్ ఫిట్‌నెస్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ సిరిసిల్లలో).
- 20న అథ్లెటిక్స్, ఆర్చరీ, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, యోగా, చెస్, కిక్ బాక్సింగ్, వుషు, జూడో, టీటీ, క్యారమ్స్, తైక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్ (సిరిసిల్ల మినీ స్టేడియం).

పెద్దపల్లి జిల్లాలో..

- 16న బ్యాడ్మింటన్, యోగా (ఎఫ్‌సీఎం, మంథని), టీటీ (ఇండియన్ పబ్లిక్ స్కూల్, సుల్తానాబాద్).
- 19న జూడో, రెజ్లింగ్ (ఇండియన్ పబ్లిక్ స్కూల్, సుల్తానాబాద్) ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ (బాలికలు, మహిళలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం సుల్తానాబాద్).
- 20న హాకీ (యైటింక్లయిన్ కాలనీ), అథ్లెటిక్స్ (బాలబాలికలు, పురుషులు, మహిళలకు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, సుల్తానాబాద్)
- 21న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ (బాలురు, పురుషులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, సుల్తానాబాద్).
- 16 నుంచి 21 వరకు హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, చెస్, కరాటే, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నారు.

సమయానికి తీసుకురావాలి



జిల్లా స్థాయి పోటీలను ఘనంగా నిర్వహిస్తాం. అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో క్రీడాకారులు హాజరుకానున్నారు. ఆయా మండలాల ఇన్‌చార్జీలు జట్లను నిర్ణీత సమయానికి తీసుకురావాలి.

– కె.రవికుమార్, డీవైఎస్‌వో, జగిత్యాల

క్రీడాకారులందరూ పాల్గొనాలి



జిల్లాస్థాయి క్రీడాపోటీలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పీఈటీలు, పీడీలు, క్రీడాసంఘాల నాయకులు, అధికారులతో సమావేశాలు నిర్వహించాం. క్రీడాకారులందరూ ఉత్సాహంగా పాల్గొనాలి.

– అజ్మీరా రాందాసు, డీవైఎస్‌వో, రాజన్న సిరిసిల్ల

రాష్ట్రస్థాయికి పంపిస్తాం



జిల్లా స్థాయి పోటీలను అట్టహాసంగా నిర్వహించేందుకు నిర్ణయించాం. ఒలింపిక్, క్రీడా, పెటా బాధ్యులందరూ పోటీల విజయవంతానికి సహకరించాలి. జిల్లాస్థాయిలో ఎంపికైన జట్లను రాష్ట్రస్థాయికి పంపిస్తాం.

– శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

సద్వినియోగం చేసుకోవాలి



సీఎం కప్ పోటీలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలి. మండలాల్లో పోటీలు అట్టహాసంగా జరుగుతున్నాయి. జిల్లా జట్లు రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి. క్రీడాకారులు సకాలంలో మైదానానికి చేరుకోవాలి.

– ఎ.సురేశ్, డీవైఎస్‌వో, పెద్దపల్లి

వ్యవసాయం ఉమ్మడి జాబితాలో ఉండాలి

- ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి
- రైతులకు పంటల పెట్టుబడి ఖర్చు తగ్గించాలి
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- హైడ్రోఫోనిక్స్ సేద్యంపై దృష్టి పెట్టాలి
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్
- పొలాసలో రాజేంద్రనగర్ వర్సిటీ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్



స్టాళ్లను పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్: వ్యవసాయ రంగం ఉమ్మడి జాబితాలో ఉండాలని, అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రైతులకు మరింత మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ వ్యవసాయ వర్సిటీ డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్స్ నేపథ్యంలో శుక్రవారం జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉత్తర తెలంగాణలోని శాస్త్రవేత్తలు, రైతులతో కలిసి వేడుకలు నిర్వహించారు. పరిశోధన స్థానానికి 40 ఏళ్లుగా సేవలందిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. దేశంలోనే రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమన్నారు. రైతాంగానికి రాష్ట్ర సర్కారు చేసే కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చేదోడుగా ఉండాలని కోరారు. పంట ఉత్పత్తి వ్యయాన్ని లెక్కలోకి తీసుకొని, మద్దతు ధర చెల్లించాలన్నారు. విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే పొలాస పరిశోధన స్థానానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. శాస్త్రవేత్తలు మరిన్ని పరిశోధనలు చేసి, రైతులకు పంటల పెట్టుబడి ఖర్చు తగ్గించాలని సూచించారు. జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. హైడ్రోఫోనిక్స్ సేద్యంపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణలో 45 లక్షల ఎకరాల్లో



శాస్త్రవేత్త భాస్కర్‌రెడ్డిని సత్కరిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తదితరులు



హాజరైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల రైతులు

పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. పొలాస కళాశాలలో పీజీ కోర్సులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఈసీ మెంబర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉత్తమ రైతు సత్యనారాయణరెడ్డి, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

శాస్త్రవేత్తలు రూపొందించిన వరి, చెరుకు, పత్తి, నువ్వులు, మొక్కజొన్న విత్తనాలను ప్రదర్శనకు ఉంచారు. అలాగే, వ్యవసాయ కళాశాలల విద్యార్థులు తమ ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా చేపట్టిన పుట్టగొడుగుల పెంపకం, స్వీట్‌కార్న్ వంటి స్టాళ్లు రైతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పరిశోధన స్థానం ప్రారంభమైన 1983లో శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ భాస్కర్‌రెడ్డి తన అనుభవాలను పంచుకున్నారు. అలాగే, ఉత్తర తెలంగాణ పరిశోధన సావనీర్ విడుదల చేశారు.

ఉత్తమ రైతులకు సన్మానం

ఉత్తర తెలంగాణకు సంబంధించిన ఉత్తమ రైతులు దండె శంకర్(ఆదిలాబాద్), మహేశ్వర్‌రెడ్డి(కామారెడ్డి), బాలాజీ (ఆసిఫాబాద్), స్వామి(మంచిర్యాల), సుదర్శన్ (నిర్మల్), రాంరెడ్డి (పూడూరు), సత్యనారాయణరెడ్డి(ధర్మపురి), వెంకటేశ్వర్‌రావు (నిజామాబాద్), లక్ష్మారెడ్డి (జోగిన్‌పల్లి), భాగ్యలక్ష్మి(కరీంనగర్), లక్ష్మీపతిగౌడ్ (సిరిసిల్ల)లను సన్మానించారు. అలాగే, రైతు దంపతులైన వెంకట్‌రెడ్డి–పద్మ, బాలయ్య–కనకవ్వ, లక్ష్మి–తిరుపతిలను సత్కరించారు. ఈ రైతులు పంటలు పండించడమే కాకుండా తోటి రైతులకు వ్యవసాయంలో నూతన టెక్నాలజీని పరిచయం చేస్తున్నారు.

ప్రతీ సదస్సుకు హాజరవుతా



పొలాస పరిశోధన స్థానంలో జరిగే ప్రతీ సదస్సుకు నేను హాజరవుతా. ఇక్కడ శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు ఆకళింపు చేసుకొని, నా పొలంలో ప్రయోగాలు చేస్తుంటాను. వ్యవసాయంలో విజయం సాధించానన్న తృప్తి ఉంది.

– రూపిరెడ్డి లక్ష్మి, మానకొండూర్

40 ఏళ్ల అనుబంధం



పొలాస శాస్త్రవేత్తలతో నాది 40 ఏళ్ల అనుబంధం. ఒకసారి వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా బోర్డు సభ్యుడిగా పని చేశాను. ప్రతీ కార్యక్రమానికి హాజరై, నా సందేహాలను నివృత్తి చేసుకుంటా. నాకు తెలిసినవి చెబుతుంటా.

– వెల్ముల రాంరెడ్డి, పూడూరు, కొడిమ్యాల

పరిశోధనలపై దృష్టి పెడతాం



శాస్త్రవేత్తల పరిశోధనలపై మా ఆయన, నేను దృష్టి పెడతాం. అధిక దిగుబడినిచ్చే విత్తనాలను పరిశోధన స్థానం నుంచి తీసుకెళ్లి, మా పొలంలో వేసుకుంటాం. అధిక దిగుబడికి శాస్త్రవేత్తల సలహాలు ఉపయోగపడుతున్నాయి.

– వంగల పద్మ, సిర్సపల్లి, హుజూరాబాద్

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- కల్వర్టును కారు ఢీకొట్టడంతో ఘటన

పాలకుర్తి(రామగుండం): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బసంత్‌నగర్ ఎస్సై స్వామి వివరాల ప్రకారం.. గోదావరిఖని అడ్డగుంటపల్లికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అనసూరి లక్ష్మీరాజం(62), భార్య వీరలక్ష్మి, కుమారుడు సతీశ్ హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. శుక్రవారం తిరిగి వస్తుండగా పాలకుర్తి మండలంలోని బసంత్‌నగర్ బస్టాండ్ దాటాక కారు అదుపుతప్పి, కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో హెచ్‌కేఆర్ అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మీరాజం మృతిచెందాడు. ఎస్సై స్వామి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న కారును తొలగించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

22 వరకు 'ట్రినిటీ' ఒలింపియాడ్ టెస్ట్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు

కరీంనగర్: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి ట్రినిటీ జూనియర్ కళాశాలల ఆధ్వర్యంలో ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాలల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని ఎస్సెస్సీ విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ వరకు ఒలింపియాడ్ లెవెల్–1 పరీక్షను వారివారి స్కూల్స్‌లోనే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని కళాశాల ఆవరణలో సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 22న రామానుజన్ జయంతి సందర్భంగా లెవెల్–2 పరీక్ష కరీంనగర్ పట్టణంలోని ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్, ఏసీ బాయ్స్ క్యాంపస్, ఏసీ గర్ల్స్ క్యాంపస్‌లలో జరుపుతామని తెలిపారు. ఇక్కడ సత్తా చాటిన వారికి 25న ట్రినిటీ ప్రైమ్ క్యాంపస్‌లో బహుమతి ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.10,000, రెండో బహుమతి రూ.7,500, మూడో బహుమతి రూ.5 వేలు, నాలుగో బహుమతి రూ.3 వేలు, ఐదో బహుమతి రూ.2 వేలు, 6 నుంచి 10 ర్యాంకులు వరకు రూ.1,500, 20 మంది విద్యార్థులకు రూ.1,000 చొప్పున ఇవ్వడంతోపాటు మెడల్స్, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు ఇస్తామన్నారు. లెవెల్–2 పరీక్షలో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులకు తమ కళాశాలలో 10 నుంచి 100 శాతం వరకు ఫీజు రాయితీ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



సురేశ్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై గణేశ్ వివరాల ప్రకారం.. ముస్తాబాద్ మండలం పోతుగల్‌కు చెందిన కంచం సురేశ్(28) ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి, రెండేళ్ల క్రితమే వచ్చాడు. సిరిసిల్లలో ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. అతని తల్లి పదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, సోదరుడు నరేశ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులతో సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం కుమారుడు ఉరితాడుకు వేలాడుతూ కనిపించడంతో తండ్రి నర్సయ్య కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేములవాడలో వివాహిత..

వేములవాడ: పట్టణానికి చెందిన సోమినేని మౌనిక (30) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మౌనిక కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కడుపునొప్పి భరించలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుందని ఆమె తండ్రి తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వీరాపూర్‌లో వృద్ధుడు..

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప రాజలింగం (63) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజలింగం భూమికి సంబంధించి దారి సమస్య ఏళ్లుగా పరిష్కారం కావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన శుక్రవారం క్రిమిసంహారక మందు తాగాడు. స్థానికులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య కనకవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి మరొకరు..

కరీంనగర్ క్రైం: జీవితంపై విరక్తి చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నగరంలోని కట్టరాంపూర్‌కు చెందిన కుంకుమల్ల శ్రీరాములు(78) కుటుంబసభ్యులతో కలిసి స్థానిక ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. ఐదేళ్లుగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఎంతకూ నయం కాకపోవడంతో చనిపోతానని కుటుంబసభ్యులతో అంటుండేవాడు. శుక్రవారం లిఫ్ట్‌లో ఐదో అంతస్తుకు వెళ్లి, దూకాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలవడంతో శ్రీరాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కరీంనగర్ క్రైం: కరీంనగర్ మార్కెట్ ఏరియాలోని కేడీసీసీ బ్యాంకు సమీపంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఎవరి సంబంధీకులైనా కనిపించకపోతే తమను ఆశ్రయించాలని సూచించారు.

యువకుడి మిస్సింగ్

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని మెట్‌పల్లికి చెందిన క్యాదాసి సంపత్ అదృశ్యమైనట్లు కేశవపట్నం పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. సంపత్ గత నెల 17న బైక్‌పై ఇంటి నుంచి వెళ్లి, తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య స్రవంతి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సైన్స్ ఫెయిర్ విజేతలు 37 మంది

- ప్రశంసాపత్రాలు అందించిన డీఈవో మాధవి
- ముగిసిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్, వైజ్ఞానిక ప్రదర్శనలు



విజేతలకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీఈవో మాధవి

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం టీటీఎస్‌లో జరిగిన పెద్దపల్లి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీల్లో 37 మంది విజేతలుగా నిలిచారు. ఇన్‌స్పైర్ మనాక్, వైజ్ఞానిక ప్రదర్శనలు శుక్రవారం ముగిశాయి. వాటిని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆసక్తిగా తిలకించారు. విజేతలకు డీఈవో మాధవి ప్రశంసాపత్రాలు అందించారు. జిల్లాస్థాయిలో ఎంపికైన ఎగ్జిబిట్స్‌ను రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్‌రావు, న్యాయ నిర్ణేతలు అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎంఎ.షుకూర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్ విజేతలు..

1. పి.అభిలాష్ (సోలార్ పవర్ డిసలైనేషన్)
2. పి.జయసింహ (అడ్వాన్స్‌డ్ ఫిల్లింగ్, క్యారింగ్ టూల్)
3. సీహెచ్.చంద్రిక (ఫర్టిలైజర్ స్ప్రే వితవుట్ మ్యాన్)
4. జి.వర్షిత్ (ఇంటెలిజెంట్ హెల్మెట్)
5. పి.సిరివెన్నెల (చైల్డ్ సేఫ్టీ బాండ్ అండ్ ట్రాకింగ్ సిస్టం)
6. వి.మణీశ్వర్ (యాంటీ థెఫ్ట్ అలెర్టింగ్ సిస్టం ఫర్ వెహికిల్స్)
7. ఆర్.సహస్ర (రైతు క్రాంతి)

సీనియర్స్ విభాగంలో (వైజ్ఞానిక)..

ఉప అంశం : ఫుడ్ హెల్త్ అండ్ హైజీన్
ప్రథమ స్థానం : మనోజ్, మస్కిటో ఇన్‌సెక్ట్ (జెడ్పీహెచ్‌ఎస్, జూలపల్లి)
ద్వితీయ స్థానం : ఎ.గణేశ్, పెస్టిసైడ్ స్ప్రింక్లర్ (జెడ్పీహెచ్‌ఎస్, అంతర్గాం)
ఉప అంశం : ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్
ప్రథమ స్థానం : కె.సాయిచరణ్ తేజ, అపోజిట్ వెహికిల్ అలర్టింగ్ సిస్టం, సింగరేణి స్కూల్, సెక్టార్–2)
ద్వితీయ స్థానం : హర్ష, స్పీడ్ లాక్ ఫర్ టూవీలర్స్ (వాణి సెకండరీ స్కూల్–సెంటినరీకాలనీ)
ఉప అంశం : నేచురల్ ఫామింగ్
ప్రథమ స్థానం : రినేశ్, వెర్టికల్ ఫామింగ్ (వాణి సెకండరీ స్కూల్, సెంటినరీకాలనీ)
ద్వితీయ స్థానం : కె.అక్షర, ఎకోస్పేర్ (కేజీబీవీ, అంతర్గాం)
ఉప అంశం : డిజాస్టర్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : ఉమేశ్‌చంద్ర, నారీ శక్తి (వాణి సెకండరీ హైస్కూల్, సెంటినరీకాలనీ)
ద్వితీయ స్థానం : సాయి శశాంక్, రెయిన్ డిటెక్టర్ (జెడ్పీహెచ్‌ఎస్, కుక్కలగూడూరు)
ఉప అంశం : మ్యాథమెటికల్ మోడలింగ్ అండ్ కంప్యూటేషనల్ థింకింగ్
ప్రథమ స్థానం : యోగేశ్, అప్లికేషన్ ఆఫ్ ట్రిగనామెట్రీ(అల్ఫోర్స్ హైస్కూల్, సుల్తానాబాద్)
ద్వితీయ స్థానం : డి.అంజనాశ్రీ, మాథ్స్ మోడల్స్ (ప్రగతి హైస్కూల్, రామగిరి)
ఉప అంశం: వేస్ట్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : ఎస్కే.హమీమా, ఎలక్ట్రిక్ జనరేటర్ ఫ్రమ్ వేస్ట్(గాయత్రి విద్యానికేతన్, పెద్దపల్లి)
ద్వితీయ స్థానం : ఎన్.రోహిత్‌కుమార్, కార్బన్ ప్యూరిఫయర్(గ్లోబల్ హైస్కూల్, పెద్దపల్లి)
ఉప అంశం : రిసోర్స్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : సచిన్ రాథోడ్, కలెక్షన్ ఆఫ్ వాటర్ ఫ్రమ్ ఎయిర్(నవోదయ హైస్కూల్, రామగుండం)
ద్వితీయ స్థానం : రాంచరణ్, ప్లాస్టిక్ టు పెట్రోల్(జెడ్పీహెచ్‌ఎస్, బేగంపేట)
మిల్లెట్స్ ఫర్ సస్టెయినబుల్ ఫ్యూచర్ అండ్ హెల్త్(సెమినార్)లో వైష్ణవి(కేజీబీవీ, అంతర్గాం), టీఎల్‌ఎం (ట్రైనీ టీచర్) పి.శైలజ, అపూర్వ బీఈడీ కాలేజీ, సుల్తానాబాద్.

వైజ్ఞానిక ప్రదర్శనల విజేతలు..

జూనియర్స్ విభాగంలో..

ఉప అంశం : ఫుడ్ హెల్త్ అండ్ హైజీన్
ప్రథమ స్థానం : ఆర్.శివేశ్వర్, రిచ్ డైట్ ఆర్గాన్స్ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్, రామగుండం)
ద్వితీయ స్థానం : సహస్ర, ఆర్గానిక్ ఫుడ్(ప్రగతి హైస్కూల్, రామగిరి)
ఉప అంశం : ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్
ప్రథమ స్థానం : ఎస్.కార్తికేయ, యాంటీ కొలిజియం టెక్నాలజీ(సెయింట్ క్లేర్ హైస్కూల్, ఎన్టీపీసీ)
ద్వితీయ స్థానం : జి.త్రిలోచనవర్మ, ఆల్కహాల్ డిటెక్షన్ (అల్ఫోర్స్ హైస్కూల్, సుల్తానాబాద్)
ఉప అంశం : నేచురల్ ఫామింగ్
ప్రథమ స్థానం : కె.అక్షయ, ఆర్గానిక్ ఫామింగ్ (జెడ్పీహెచ్‌ఎస్, సుల్తాన్‌పూర్)
ద్వితీయ స్థానం : సంజన, మెటామార్ఫోసిస్ ఆఫ్ అగ్రికల్చర్ (సెయింట్ క్లేర్ హైస్కూల్, ఎన్టీపీసీ)
ఉప అంశం : డిజాస్టర్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : రాంచరణ్, ప్యాడీ ప్రొటెక్టర్ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్–బాలురు, రామగుండం)
ద్వితీయ స్థానం : బి.అశ్విత్, మంకీ గన్ (జెడ్పీహెచ్‌ఎస్, నందిమేడారం)
ఉప అంశం : మ్యాథమెటికల్ మోడలింగ్ అండ్ కంప్యూటేషనల్ థింకింగ్
ప్రథమ స్థానం : ఎన్.అక్షిత, మేజిక్ ఆఫ్ గ్రాఫ్ (యూపీఎస్, దుర్గయ్యపల్లె)
ద్వితీయ స్థానం : మనేశ్‌కుమార్, ఆంజిల్ సమ్ ప్రాపర్టీ (జెడ్పీహెచ్‌ఎస్, శ్రీరాంపూర్)
ఉప అంశం : వేస్ట్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : హెమాన్స్, స్మార్ట్ ఛాయిస్ టుడే సస్టెయినబుల్ టుమారో(సెయింట్ క్లేర్ హైస్కూల్, ఎన్టీపీసీ)
ద్వితీయ స్థానం : టి.హర్షిణి రెడ్డి, బయో వేస్ట్ మేనేజ్‌మెంట్ (పల్లవి స్కూల్, పెద్దపల్లి)
ఉప అంశం: రిసోర్స్ మేనేజ్‌మెంట్
ప్రథమ స్థానం : ఆర్.వర్షిణి, మోడ్రన్ మల్టిపుల్ పవర్ జనరేషన్ టవర్(విశ్వభారతి హైస్కూల్, ఎన్టీపీసీ రామగుండం)
ద్వితీయ స్థానం : ఎం.అశ్విత, జియో థర్మల్ ప్లాంట్ (ఎంజేపీఆర్‌బీసీఆర్‌డబ్ల్యూఎస్, రామగుండం)